పర్యటనలే మనిషిని పరిపూర్ణుడిని చేస్తాయి. ‘ఓ ఏడాది గడిచిపోయే సరికి... ఇంతకుముందు చూడని ప్రదేశానికి వెళ్లిరావాలి’ అంటారు బౌద్ధ గురువు దలైలామా. ఇంటినుంచి అడుగు బయట పెట్టకపోతే మాత్రం ఉన్నచోటనే ఉండిపోతాం. అదే కొత్త ప్రదేశాలను చుట్టేసి వస్తే కొత్త అనుభూతులు, సరికొత్త అనుభవాలు పోగేసుకుంటాం. మనసు విశాలమవుతుంది. ఇలాంటి దర్శనీయ స్థలాలు ప్రపంచంలో చాలానే ఉంటాయి. వాటిలోంచి ఈ ఏడాది సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలను సిఫారసు చేస్తున్నారు పర్యాటక నిపుణులు. మనం ఎంచుకునే చోటును బట్టి, మన జీవనశైలిని బట్టి వ్యయాలు మారుతూ ఉంటాయి.

... చింతలపల్లి హర్షవర్ధన్



## నెగొంబో, శ్రీలంక



1

**శ్రీలంక రాజధాని** కొలంబో సమీపంలోని సముద్రతీర నగరం నెగొంబో. బండారనాయకే అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లోనే ఉంటుంది. సముద్రపు కయ్య (లగూన్)ను అనుసరించుకుని ఉన్న నెగొంబో శ్రీలంకలో పురాతనమైన చేపల పరిశ్రమకు నెలవైన నగరం. ఇక్కడి బీచ్ ప్రశాంతంగా ఉంటుంది. సముద్రం మీద మత్స్యకారులు చేపల్ని వేటాడే దృశ్యాలు కట్టిపడేస్తాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో సముద్రంలో మునిగిపోయిన బ్రిటిష్ సరుకు రవాణా విమానాన్ని చూడటానికి డైవింగ్ సదుపాయం ఉంటుంది. తీర ప్రాంతంలో మడ అడవులు ప్రత్యేక ఆకర్షణ. వీటిని చూడటానికి పడవ సదుపాయం ఉంది. అలా వెళ్తూ వెళ్తూ నీటి ఉడుములు, వలస పక్షులను చూసి పరవశించిపోవచ్చు. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మున్నేశ్వరం దేవాలయం, స్థానికంగా ఉండే చేపల మార్కెట్ కూడా దర్శనీయమే. ఇక్కడి పెద్దపెద్ద హోటళ్లు విండ్ సర్ఫింగ్, సెయిలింగ్, స్కీయింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తుండటం విశేషం.